

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అర్జీలు సమర్పించాలని సూచించారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతం

కదిరి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 9.30 గంటలకు కలిశపూజ, 10కి వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతాయన్నారు. వ్రతంలో పాల్గొనే మహిళలు ఈనెల 18వ తేదీలోపు పేర్లు, గోత్రం దేవాలయ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు.

గోరంట్లలో భారీ చోరీ

- 150 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదు అపహరణ (7లో..)



పోతులనాగేపల్లి వద్ద పారుతున్న చిత్రావతి నది

దంచికొట్టిన వాన

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షం

- తాడిపత్రిలో కుండపోత
- పొంగిపొర్లిన వంకలు, వాగులు
- తెగిన వంతెనలు
- కూలిన ఇళ్లు



మునిమడుగులో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

తాడిపత్రి/అనంతపురం అర్బన్/పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు/పెనుకొండ రూరల్/, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. తాడిపత్రి నియోజకవర్గంలో కుండపోతగా కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పలు ఇళ్లు కూలడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

తాడిపత్రిలో వర్ష బీభత్సం

తాడిపత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. బుగ్గ సమీపంలో తాడిపత్రి-నంద్యాల రోడ్డు తెగిపోవడంతో ట్రాఫిక్ కిలోమీటర్ల మేర స్తంభించింది. 4గంటలపాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం అధికారులు వాటిని పైపుల ద్వారా పూడ్చి (మిగతా 7లో...)

కొత్త పరీక్ష..!

- విద్యార్థులకు పుస్తక రూపంలో నిర్వహణ
- ఒకే బుక్‌లెట్‌లోనే అన్ని సమాధానాలు
- భద్రపరచడం టీచర్లకు తలనొప్పే
- నేటి నుంచే నూతన పద్ధతిలో ఎఫ్ఏ-1



విద్యార్థినులు

అనంతపురం విద్య, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయడానికి పరీక్షా పద్ధతుల్లో నూతన ఒరవడికి విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు ఆశించిన మేర ఉండడంలేదు. కిందిస్థాయి నుంచి పైస్థాయి తరగతుల వరకు సగం మంది పిల్లలు సరిగా చదవడం, కూడికలు, తీసివేతలు వంటివి చేయడం కూడా రాదని ఇటీవల కేంద్ర సంస్థలు నిర్వహించిన సర్వేలో బయటపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు పిల్లల అభ్యసనా సామర్థ్యాలు గుర్తింపునకు పరీక్షల నిర్వహణలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చారు. గతంలో టెస్టులు, క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ, ఫైనల్ పరీక్షలు తెల్లపేపర్లపై రాయించి టీచర్లు మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేవారు. ఈ విద్యా సంవత్సరం నిర్వహించే పరీక్షలన్నీ ఒకే బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. అన్ని పరీక్షల సమాధానాలు అదే బుక్‌లెట్‌లోనే ఉంటాయి. తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి ఒక్కో బుక్‌లెట్ రూపంలో అసెస్‌మెంట్ ఆన్సర్‌షీట్ ఉంటుంది. ఈ బుక్‌లెట్‌లోనే ఏడాదిలో అన్ని పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

నేటి నుంచే కొత్త పద్ధతిలో ఎఫ్ఏ-1 పరీక్షలు

కొత్త విధానంలో జరిగే తొలి ఎఫ్ఏ-1 పరీక్షలు సోమవారం నుంచి మొదలు కానున్నాయి. 13వ తేదీ వరకు ప్రైమరీ స్కూల్స్ విద్యార్థులకు, 14వ తేదీ వరకు 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. రాష్ట్ర శాఖ నుంచి వచ్చిన బుక్‌లెట్స్‌ను (మిగతా 7లో...)

భక్తి పారవశ్యం

పుట్టపర్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు శ్రీసత్యసాయి గీతాంజలి పేరిట భక్తిగీతాల ఆలాపనతో మైమరపింపజేశారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో తెలంగాణ బాలవికాస్ చిన్నారులు రెండోరోజు ఆదివారం భక్తిగీతాల ఆలాపన చేపట్టారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై మధురగానంతో అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న బాలవికాస్ చిన్నారులు

సెక్టోరల్స్ నియామకానికి మరో అడుగు

- నేడు, రేపు టీచర్లకు ఇంటర్వ్యూలు

7

పారిశ్రామిక వెలుగులు

ఇండస్ట్రియల్ పార్కుల్లో శరవేగంగా అభివృద్ధి పనులు



కప్పలబండ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

పుట్టపర్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధి వేగం పుంజుకుంటోంది. ఇందుకు జిల్లా కేంద్రంలోని కప్పలబండ పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాల కల్పనే నిదర్శనం. జిల్లాలో ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పార్కుల్లో గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు 43 కొత్త పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు వచ్చాయి. వాటికి 1,453 ఎకరాల భూమిని కేటాయించారు. ఏపీఐఐసీ భూములు అభివృద్ధి చేసి కప్పలబండ, గుడిపల్లి, ఆర్.అనంతపురం, అమ్మవారిపల్లి, ఎర్రమంచి, గోళ్లాపురం, కొటిపి, ముత్యాలచెరువు, దాదులూరు, టేకులోడు ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలను సిద్ధం చేస్తోంది. ఆర్.అనంతపురం పారిశ్రామిక వాడకు 439 ఎకరాలను కేటాయించింది. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్, బెల్ కూడా 2015లోనే స్థాపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక పాలసీ 2.0ను అమలు చేస్తోంది. పరిశ్రమల ఏర్పాటును సులభతరం చేస్తోంది. ఇప్పటికే లేపాక్షి, మడకశిర మధ్య సైనిక, పౌర విమానాలు, రక్షణ రంగం ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, ఏరోస్పేస్ ఎకోసిస్టం పరిశ్రమలు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకు భూసేకరణ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లాకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాదిలోనే జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక చొరవతో ఓవైపు భూసేకరణ, మరోవైపు పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇక.. పరిశ్రమలు రావడమే తరువాయి.

కప్పలబండలో..

పుట్టపర్తి పరిధిలోని కప్పలబండ పారిశ్రామిక వాడలో సదుపాయాల కల్పన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 101 ఎకరాల్లో తొలి విడతలో 2014-19లోనే టీడీపీ ప్రభుత్వం 50 ఎకరాల్లో సదుపాయాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే రూ.9 కోట్లతో సదుపాయాలను అభివృద్ధి చేశారు. పారిశ్రామిక వాడలో విశాలమైన రోడ్లు, అండర్ డ్రైనేజీ, లైటింగ్, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించారు. పారిశ్రామికవాడలో అర ఎకరా మొదలుకుని, ఎకరాదాకా ప్లాట్లుగా విభజించి అభివృద్ధి చేశారు. ఏడాదిలోపే సదుపాయాల కల్పనతో కప్పలబండ పారిశ్రామిక వాడ ప్రగతి కొత్త పుంతలు తొక్కుతూ పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానిస్తోంది. ఇప్పటికే తొలి దశలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలో కొన్ని పరిశ్రమలు స్థాపించారు. మరికొన్ని దరఖాస్తులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాయి. తాజాగా అభివృద్ధి చేసిన రెండో విడతలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉంది.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

7

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

7

ఉపాధిలో మాయలు..!

కందకాల పనుల్లో అక్రమాలు.. పాత వాటికే కొత్త బిల్లులు

- ఎక్స్‌కవేటర్‌తో నీటికుంటల తవ్వకాలు
- పనులకు వెళ్లకపోయినా వేతనాలు
- చెరి సగం పంపకాలు

గాండ్లపెంట, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనుల్లో మాయలు చేస్తున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గతంలో తవ్విన కందకాలకే మళ్లీ బిల్లులు కాజేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్స్‌కవేటర్‌తో నీటికుంటలు తవ్వుతున్నారు. పనులకు వెళ్లకపోయినా.. బిల్లులు చేసి సిబ్బంది, కూలీలు చెరి సగం పంచుకుంటున్నారు.

బిల్లులు మళ్లీ.. మళ్లీ..

మండలంలో 14 పంచాయతీల పరిధిలో 14,180 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. వీరిలో పలువురు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. వారుకూడా పనులు చేసినట్లు చూపి బిల్లులు స్వాహా చేస్తున్నారు. 2025-26కిగాను ఉపాధి పథకంలో కందకాలు, నీటి కుంటలు, చెరువుల్లో పూడికతీత తదితర పనులు చేపడుతున్నారు. కొండగుట్టల్లో కందకాల పనులు చేపడుతున్నారు. పాత కందకాల్లోనే గడ్డిని తొలగించి, కొత్తగా తవ్వినట్లు బిల్లులు చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి పంచాయతీలో ఈ తంతు సాగుతోందని సమాచారం. దీనిపై ప్రశ్నిస్తే ఉపాధి పథకం సిబ్బంది ఏకంగా గొడవలకు దిగుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

చెరి సగం..

ఉపాధి హామీ పథకంలో ఏటా పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, దళారులు కుమ్మక్కై బిల్లులు పంచుకుంటున్నారు. ఉపాధి కూలీల వద్ద జాబ్‌కార్డులు తీసుకుని, మస్టర్లలో నమోదుచేసి, బిల్లులు చేయించుకుంటున్నారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, పైస్థాయి అధికారులకు కూడా వాటాలు పంచుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ వీఆర్ఏ తనతో పాటు భార్య పేరుతో ఉపాధి పనులు చేసినట్లు బిల్లులు తీసుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

ఎక్స్‌కవేటర్‌తో తవ్వి..

ఉపాధి హామీ పథకంలో నీటి కుంటలను నిబంధనల మేరకు కూలీలతోనే తవ్వించాలి. మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీ వేపలకుంటలో అందుకు విరుద్ధంగా కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి ఎక్స్‌కవేటర్‌తో తవ్వించారు.


ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం

ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా బిల్లులు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం. ఎక్స్‌కవేటర్‌తో చేసిన పనులకు బిల్లులు చేయలేదు.

-చంద్రశేఖర్, ఏపీఓ, గాండ్లపెంట



చీకురాళ్ల గుట్టలో పాత కందకంలోనే కొత్తగా గడ్డిని తొలగించిన దృశ్యం



ఉపాధి పనులు చేసిన గుట్టలు



వేపలకుంట వద్ద ఎక్స్‌కవేటర్‌తో నీటికుంట తవ్వుతున్న దృశ్యం

నగర ప్రయాణం.. నరకప్రాయం..!

గుంతల రోడ్లతో వాహనదారుల బెంబేలు

- ప్రధాన రహదారుల్లోనూ అదే దుస్థితి
- చినుకుపడితే వర్ణనాతీతం..



అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఏర్పడిన గుంతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఏ రోడ్డుకెళ్లినా గుంతలే దర్శనమిస్తున్నాయి. మోకాలిలోతు గుంతల్లో ప్రయాణించాల్సి రావడంతో నడుములు విరుగుతున్నాయని నగరవాసులు వాపోతున్నారు. పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. రోడ్లపై గుంతలు చాలవన్నట్లు స్పీడ్ బ్రేకర్లు విసుగు పుట్టిస్తున్నాయి. అవసరం లేని చోట్ల వేస్తున్నారు. ప్రజల కూడా ఎక్కడపడితే అక్కడ వేసేసుకుంటున్నారు. ఒక్కో రోడ్డులో పదుల సంఖ్యలో స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో వాహనదారులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

ఏ దారికెళ్లినా గుంతలే..

అనంత నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో పైపులైన్ల కోసం గతంలో గుంతలు తీశారు. వాటిని పూడ్చడం మరచిపోయారు. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లలో వెళ్లాలంటే ఆ గుంతల్లో దిగాల్సిందే. నగరంలో ఏ వీధిలోకి వెళ్లినా గుంతలు తప్పవు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క గుంత కూడా పూడ్చిన పాపాన పోలేదు. కొత్త రోడ్డు కూడా వేయలేదు. ఐదేళ్లు (మిగతా 7లో)



నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం రోడ్డులో దుస్థితి



సోమనాథ్‌నగర్ బ్రిడ్జి వద్ద తేలిన రాళ్లు



సోమనాథ్‌నగర్‌లో గుంతలు

నగర ప్రయాణం.. నరకప్రాయం..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మతులు చేయకపోవడంతో గుంతలు విపరీతమయ్యాయి.

చినుకుపడితే అంతే..

నగరంలో చినుకుపడితే గుంతల్లో నీరు నిలబడిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అశోక్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న గుంతల్లో చినుకుపడి గుంతలు మరింత లోతుగా ఏర్పడ్డాయి. దీంతో మోకాల్లోతు వర్షం నీరు నిల్వ ఉంటుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

స్పీడ్ బ్రేకర్లతో బేజారు

నగరంలో అవసరం లేని చోట్ల కూడా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో ప్రజలు బేజారవుతున్నారు. నవోదయకాలనీ స్మశానం నుంచి విద్యుత్నగర్‌లోకి ప్రధాన రహదారి రెండు కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో సుమారు 20 స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు విసిగిపోతున్నారు. ఇక్కడ అన్ని స్పీడ్ బ్రేకర్లు అవసరం లేకపోయినా... ఎవరికి వారు స్పీడ్‌బ్రేకర్లు వేసుకున్నారు.

గుంతలు పూడ్చే చర్యలు చేపట్టాం



నగరంలోని రోడ్లలో ఉన్న గుంతలు పూడ్చి, రహదారుల మరమ్మతులు చేపడుతున్నాం. ఇటీవల స్టాండింగ్ కమిటీలో కూడా పలు రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు అనుమతిఇచ్చారు. టెండర్లు వేసి పనులు చేపడతాం. ఇక వర్షం పడినపుడు నీరు నిలబడితే భూమి పలచపడి గుంతలు ఏర్పడతాయి. గుంతలు లేకుండా రోడ్లు నిర్మిస్తే వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లిపోతుంది. అవసరం ఉన్న చోట మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

-బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్

ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు మధు రాయల్, రమేష్ రాయల్, జోగి రాజేంద్ర తదితరులు

అనంతపురం క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదిన వేడుకలను ఆదివారం అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ కోలాహలం నెలకొంది. పెద్ద పెద్ద కేక్‌లను ఆయనతో కట్ చేయించారు. ఒకరికొకరు కేక్‌లు, స్వీట్లు పంచుకుని సందడిగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే నేత్రదానానికి ముందుకు వచ్చారు. ఆయన నుంచి స్ఫూర్తి పొందిన ఆయన సతీమణి శ్రీలక్ష్మి, వారి కుమార్తె అశ్రిత సైతం నేత్రదానానికి అంగీకరించారు. భారీ మెజారిటీతో గెలిపించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు శక్తిఉన్నంత వరకూ సేవ చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

విలువలను బోధించే 'జీవన శిల్పి'

-పుస్తకావిష్కరణ సభలో డాక్టర్ శాంతినారాయణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మనిషి జీవిత విలువలను బోధించే కవితా సంపుటి 'జీవన శిల్పి' అని ప్రముఖ రచయిత డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' పుస్తకావిష్కరణ సభను జిల్లా రచయితల సంఘం (జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో శాంతినారాయణ మాట్లాడుతూ.. గుడిపాటి సూర్యం రచించిన ఈ కవిత్వం జగతికి జీవన విలువలను నేర్పుతుందన్నారు. రైతు జీవితాన్ని, వర్ధమాన ప్రజా జీవిత సంఘర్షణను, విలువలు మృగ్యమైపోతున్న సమాజ తీరును ఈ పుస్తకంలో అక్షరబద్ధం చేశారని పేర్కొన్నారు. అనంతరం రచయిత గుడిపాటి సూర్యం మాట్లాడుతూ... ప్రపంచం నిండా వేదన నిండుకున్నపుడు కవిత్వం రాయకుండా ఉండలేకపోయానని అన్నారు. కవిత్వానికే పరిమితం కాకుండా తాను కథ, నవలా రచన కూడా చేపట్టానని, త్వరలో వాటిని పుస్తకాలుగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. జిరసం నాయకులు, సాహితీవేత్తలు గుడిపాటి సూర్యాన్ని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, వెంకటేశులు, శ్రీనివాసులు, జెన్నె ఆనంద్‌కుమార్, వన్నప్ప, మధురశ్రీ, రమేష్, వంశీ, నాగభూషణ, టీవీ రెడ్డి, జూటూరు షరీఫ్, చంద్రశేఖరశాస్త్రి, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, అప్పిరెడ్డి, కటకం కృష్ణవేణి పాల్గొన్నారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఈ మేరకు జీఓ నంబరు 669ను జారీ చేశారు. 2026 జనవరి 30వతేదీ వరకు ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీల పదవీకాలం నిర్ణయించారు. బుక్కరాయసముద్రం సొసైటీ చైర్మన్‌గా కేశన్న, సభ్యులుగా సాకే గంపన్న, రామాంజినేయులును నియమించారు. జంబులదిన్నె సొసైటీ చైర్మన్‌గా మారెడ్డి కేశవరెడ్డి, సభ్యులుగా జిన్నె నాగరాజు, ఆంజనేయులును ఎంపిక చేశారు. బి. పప్పూరు సొసైటీ చైర్మన్‌గా నరసింహుడు, సభ్యులుగా లోకనాథ్, ఓబులప్పకు అవకాశం కల్పించారు. క్రిష్ణపాడు సొసైటీ చైర్మన్‌గా చిన్న చెన్నారెడ్డి, సభ్యులుగా రాముడు, పురుషోత్తంను ఎంపిక చేశారు. పెద్దవడుగూరు సొసైటీ చైర్మన్‌గా బాలాంజనేయులు, సభ్యులుగా మల్లికార్జునరెడ్డి, తలారి వాసులను నియమించారు. ముచ్చుకోట సొసైటీ చైర్మన్‌గా చిన్న నారాయణ, సభ్యులుగా లక్ష్మీదేవి, లక్ష్మీనారాయణరెడ్డికి అవకాశం దక్కింది. చీమలవాగుపల్లి సొసైటీ చైర్మన్‌గా రంగారెడ్డి, సభ్యులుగా ఈశ్వరరెడ్డి, అనంతరమణకు అవకాశం కల్పించారు. చిన్నపప్పూరు సొసైటీ చైర్మన్‌గా రుద్రేశ్వరనాయుడు, సభ్యులుగా విజయభాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డికి చోటు దక్కింది. జూటూరు సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరెడ్డి, సభ్యులుగా సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డిని ఎంపిక చేశారు. చుక్కలూరు సొసైటీ చైర్మన్‌గా రామకృష్ణారెడ్డి, సభ్యులుగా రామాంజనేయులురెడ్డి, చంద్రమోహన్ యాదవ్‌కు దక్కింది. దిగువపల్లి సొసైటీ చైర్మన్‌గా సాంబశివారెడ్డి, సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, సుభాన్‌ను ఎంపిక చేశారు. వీరాపురం సొసైటీ చైర్మన్‌గా ప్రభాకర్ నాయుడు, సభ్యులుగా చంద్రశేఖర్‌రెడ్డి, నాగన్నను నియమించారు. వేములపాడు సొసైటీ చైర్మన్‌గా నాగమునిరెడ్డి, సభ్యులుగా వెంకటనరసింహులు, లక్ష్మీదేవిలను ఎంపిక చేశారు. యల్లనూరు సొసైటీ చైర్మన్‌గా తరిగోపుల అనిల్‌కుమార్, సభ్యులుగా సుబ్బరాయుడు, చిన్న రామన్నను నియమించారు. కంబదూరు సొసైటీ చైర్మన్‌గా బాబయ్య, సభ్యులుగా ఆదినారాయణ, రామాంజనేయులకు అవకాశం కల్పించారు. బండమీదపల్లి సొసైటీ చైర్మన్‌గా చిత్రలింగప్ప, సభ్యులుగా గోవిందప్ప, చలపతిని ఎంపిక చేశారు. కణేకల్లు సొసైటీ చైర్మన్‌గా నాగార్జున, సభ్యులుగా చిన్న ఈరప్ప, తిప్పేస్వామికి చోటు దక్కింది. రాచానపల్లి సొసైటీ చైర్మన్‌గా కలిమిశెట్టి రఘు, సభ్యులుగా శ్రీనివాసులు, బండి నారాయణను నియమించారు. ముట్టాల సొసైటీ చైర్మన్‌గా లింగన్న, సభ్యులుగా వెంకటరామిరెడ్డి, సుజాతమ్మకు అవకాశం కల్పించారు.

సెక్టోరల్స్ నియామకానికి మరో అడుగు

- నేడు, రేపు టీచర్లకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఏడాదిగా ఖాళీగా ఉన్న సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి మరో అడుగు పడింది. కీలకమైన ఈ పోస్టులను భర్తీచేయకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ సీరియస్‌గా తీసుకొని నియామకాల ప్రక్రియకు చర్యలు చేపట్టారు. ఆరు సెక్టోరల్స్‌కు వచ్చిన 171 దరఖాస్తులను కలెక్టరేట్‌లోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయించి పరిశీలింపచేయించారు. అర్హత సాధించిన టీచర్లను ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్‌లో ఉండే ఎన్ఐసీ సెంటర్‌లో ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టి టీచర్లను ఆహ్వానించారు. దీంతో సెక్టోరల్స్ నియామకాలకు లైన్‌క్లియర్ అయినట్లు కనబడుతోంది.

గుట్టుగా..

సెక్టోరల్స్ నియామకాల విషయంలో ఎస్ఎస్ఏ అధికారులు గుట్టుగానే వ్యవహారాలు నడుపుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 171 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఫలానా పోస్టుకు ఇన్ని దరఖాస్తులు వచ్చాయని మాత్రం చెప్పారు. తర్వాత జరిగిన దరఖాస్తుల పరిశీలన, ఎంత మంది అర్హత సాధించారు, ఎన్ని దరఖాస్తులను తిరస్కరించారో కూడా చెప్పలేదు. ఇంటర్వ్యూలు సంగతి కూడా ఎస్ఎస్ఏ అధికారులు చెప్పలేదు. చివరకు ఏపీసీ శైలజను 'ఆంధ్రజ్యోతి' విచారించగా.. సోమ, మంగళవారాలు ఇంటర్వ్యూలు ఉన్నాయన్నారు. ఇంటర్వ్యూలకు పిలిచిన టీచర్లలో కొందరు అనర్హులు ఉన్నారని తెలుస్తోంది. పరీక్షల సమయంలో అమ్మాయిలపట్ల అసభ్యంగా వ్యవహరించాడని గతంలో డీఈఓగా ఉన్న శ్యామూల్ సరెండర్ చేసి.. పదేళ్లపాటు ఈ శాఖకు రావడానికి అనర్హుడిగా ప్రకటించి ఉత్తర్వులు ఇచ్చిన ఓ టీచర్ కూడా ఇంటర్వ్యూ జాబితాలో ఉన్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో నియామకాలు పారదర్శకంగా జరుగుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త పరీక్ష..!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలకు, ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీలకు జిల్లా విద్యాశాఖ సరఫరా చేసింది. ప్రశ్నపత్రాలు పరీక్షకు గంట ముందు మాత్రమే ఎంఆర్‌సీల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. డీసీఈబీ నేతృత్వంలో టీచర్లకు మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

టీచర్లకూ పరీక్షే

కొత్త విధానంలో పరీక్షలు టీచర్లకూ పరీక్షగా మారాయనే అభిప్రాయాలు ఆ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒక్కో విద్యార్థికి ఒక బుక్‌లెట్ (ఆన్సర్‌షీట్) పాఠశాలలకు సరఫరా చేశారు. ఇదే బుక్‌లెట్‌లోనే ఏడాదిలో జరిగే ఎఫ్ఏ-1,2,3, ఎస్ఏ-1,2,3 పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు ముగిసేవరకు విద్యార్థికి వచ్చిన బుక్‌లెట్‌ను భద్రంగా పాఠశాలలోనే దాచిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఎక్కువ విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలో ఒక్కో టీచర్‌కు సరాసరిగా 250 నుంచి 300 వరకు బుక్‌లెట్స్ వస్తాయి. ఇక తెలుగు, హిందీ టీచర్లకు ఆ స్కూల్‌లో ఉన్న పిల్లలందరీ బుక్‌లెట్స్ వస్తాయి. వీటిని భద్రపరుచుకోవడానికి పాఠశాలలో ఉన్న టీచర్ల స్టాఫ్‌రూమ్‌లలో అల్మారాలు లేవు. ఇప్పటికే బుక్‌లెట్లను స్టాఫ్‌రూమ్‌లలో వారు కూర్చుంటున్న బెంచీలపై పెట్టుకున్నారు. వాటిని ఏడాదిపాటు ఎలా కాపాడుకోవాలో అర్థంకావడంలేదు. ఒక బుక్‌లెట్ పోతే ఆ విద్యార్థికి సంబంధించిన సమాధాన పత్రం మొత్తం ఇబ్బందిగా మారుతుంది. మూల్యాంకనంలోనూ కొత్తమెలిక పెట్టారు. విద్యార్థి రాసిన జవాబులు, పరీక్షల్లో వచ్చిన మార్కులు స్కాన్‌చేసి పంపాల్సి ఉంటుంది. మార్కులకు సంబంధించి సంజాయిషీ రాసి పంపాల్సి ఉంటుంది. ఇలాగైతే పిల్లలకు పాఠాలు చెప్పేది ఎప్పుడని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంజాయిషీ సరికాదు

ఒక విద్యార్థి ఏడాదిపాటు రాసే పరీక్షలకు సంబంధించి ఒకే బుక్‌లెట్ ఇవ్వడం మంచిదే. దీనివల్ల ఏ పరీక్షలో విద్యార్థి సామర్థ్యాలు పెరిగాయో, తగ్గాయో సులభంగా తెలుసుకోవచ్చు. పరీక్షల పత్రాలు, ఓఎంఆర్ షీట్లు, టీచర్ల మూల్యాంకనంలో ఇచ్చిన మార్కులకు సంజాయిషీ రాయడం వంటివే ఇబ్బందికరంగా మారుతున్నాయి. పెద్ద స్కూళ్లలో వందల మంది పిల్లలు ఉంటారు. అలాంటపుడు ఇన్ని పనులు ఆ టీచర్ ఎలా చేస్తారో అర్థంకావడంలేదు.

-శ్రీనివాసులు, ఫిజిక్స్ టీచర్

ఒత్తిడిలేని బోధన అవసరం



కొత్త సంస్కరణలు తీసుకొచ్చినపుడు టీచర్లు, పిల్లలకు ఉపయోగకరంగా ఉండాలి. టీచర్లపై ఒత్తిడిపెట్టి ఇలాగే చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదు. కొత్త పరీక్షల విధానంలో ఇదే జరుగుతోంది. బుక్‌లెట్స్ పెట్టుకోవడానికి పాఠశాలలో స్థలంలేదు. ఏడాదిపాటు టీచర్లు వాటిని ఎక్కడ భద్రపరచుకోవాలో తెలియడంలేదు. స్కాన్ చేసిపెట్టాలనడం టీచర్లకు మరింత భారంగా మారుతుంది. దీనివల్ల పిల్లలకు పాఠాలు చెప్పే సమయం లేక అన్యాయం జరుగుతుంది.

-రామాంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్టీయూ

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం



ఈసారి ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో కొత్త విధానం తీసుకు వచ్చింది. ఆ మేరకు ఆన్సర్‌షీట్స్ (బుక్‌లెట్స్), ప్రశ్నపత్రాలు జిల్లాకు వచ్చాయి. 1 నుంచి 5వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలను క్లస్టర్ స్కూళ్లకు, 6నుంచి 10వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీలకు పంపి భద్రపరిచాం. పరీక్ష రోజు గంట ముందు మాత్రమే అక్కడికి వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలి. ఎక్కడైనా సమస్యలు వస్తే మా దృష్టికి తీసుకురావాలి.

-గంధం శ్రీనివాసులు, కార్యదర్శి, డీసీఈబీ

దంచికొట్టిన వాన

(5వ పేజీ తరువాయి)

రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. ఆవులతిప్పాయపల్లి సమీపంలో జీపు వంక దాటుతుండగా కొట్టుకుపోయింది. డ్రైవర్ ఒడ్డుకు చేరుకుని, ప్రాణాలు కాపడుకున్నాడు. ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయ సమీపంలో తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొండచరియలు విరిగిపడడంతో ఆ బురద మట్టిలో వాహనాలు కూరుకుపోయాయి. తాడిపత్రిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లక్ష్మీనారాయణటాకీస్‌లోకి వర్షపునీరు చేరింది.

- పుట్లూరు మండలంలోని ఎస్. తిమ్మాపురం గోడౌన్ వద్ద తక్కళ్లపల్లికి వెళ్లే కల్వర్టు వర్షానికి కూలిపోయింది. దీంతో తక్కళ్లపల్లి నుంచి తాడిపత్రికి రాకపోకలు స్తంభించిపోయాయి. మండలవ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో వంకలు పొంగి పొర్లాయి.
- పెద్దవడుగూరులో వర్షానికి పీర్లచావిడి పైభాగం ఆదివారం ఉదయం కూలిపోయింది. నిత్యం పీర్లచావిడి కట్ట వద్ద పదుల సంఖ్యలో జనం కూర్చునేవారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- యల్లనూరు మండలంలో తాడిపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై నిట్టూరు గాండ్లపాడు, గన్నేరుపల్లి వంకలు ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం 10 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం 1గంటల ప్రాంతంలో పెద్ద పెద్ద ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వంక మరోసారి ఉధృతంగా ప్రవహించింది. దీంతో చిత్రావతి నదిలో ప్రవాహం భారీగా పెరిగింది.

చిత్రావతి పరవళ్లు

ధర్మవరం: మండలంలోని పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా పారుతోంది. బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి వర్షపునీరు ధర్మవరం చెరువుకు చేరుతోంది. దీంతో నదికి నీటి ప్రవాహం పెరిగింది. పోతులనాగేపల్లి వద్ద నది ఉధృతంగా ప్రవహించడంతో కనంపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి.

- పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మించి, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడమే ఈ దుస్థితికి కారణమని వారు వాపోయారు.

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పదును వర్షం పడింది. కొత్తచెరువులో అత్యధికంగా 7.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడిపత్రి 7.2, నార్పల 6.6, నల్లమాడ మండలంలో 6.52 సెం.మీ., బుక్కపట్నంలో 5.90 సెం.మీ., పుట్టపర్తి 5.86, పుట్లూరు 5.8, యల్లనూరు 5.6, శెట్టూరు 5.5, గాండ్లపెంట 5.44, ఓబుళదేవరచెరువు 5.42, రొద్దం 5.16, తాడిమర్రి 4.72, సోమందేపల్లి 4.70, పెనుకొండ 4.46, తనకల్లు 4.46, నల్లచెరువు 4.42, చెన్నేకొత్తపల్లి 4.26, గుడిబండ 4.12, గోరంట్ల 3.82, బత్తలపల్లి 3.62, మడకశిర 3.56, ధర్మవరం 3.46, ముదిగుబ్బ 3.22, పరిగి 3.04, గుమ్మఘట్ట 2.8, కదిరి 2.68, హిందూపురం 2.18, కంబదూరు 1.9, లేపాక్షి 1.82, రాయదుర్గం 1.7, రొళ్ల 1.54, తలుపుల 1.22, చిలమత్తూరు 1.20, అగళి 1.18, కనగానిపల్లి 1.02, రామగిరి 0.28 సెం.మీ. వర్షం కురిసిందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.



పెద్దవడుగూరులో కూలిన పీర్ల చావిడి పైకప్పు



పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపునీరు



పుట్లూరు మండలం ఎస్ తిమ్మాపురం గోడౌన్ వద్ద కుంగిపోయిన కల్వర్టు

ఆటోమొబైల్ షాపులో చోరీ

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న శ్రీరాం ఆటో మొబైల్ షాప్‌లో చోరీ జరిగినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రోడ్డులో ఉండే శ్రీరాం ఆటో మొబైల్‌షాప్‌ను శనివారం రాత్రి యజమానులు రాజేష్, పతారం షాప్ మూసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం తిరిగి షాప్ తెరవడానికి వచ్చారు. షాప్ షట్టర్‌ను తెరచి ఉండడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాప్‌లోకి వెళ్లి చూడగా అందులో ఉన్న రూ.2 లక్షల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. మరింత డబ్బు ఉన్నట్లు షాప్ యజమానులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ శివనారాయణ స్వామి పరిశీలించారు.

నేడు జిల్లా జైలులో వేరుశనగ వేలం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా జైలులో సోమవారం వేరుశనగ చెక్క వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జైలులో ఉన్న 25వేల కిలోల వేరుశనగ చెక్కను వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలం పాట జిల్లా జైలులో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు.

టమోటా కిలో రూ.40

అనంతపురంరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.24, సరాసరి ధర రూ.30 పలికాయన్నారు. మార్కెట్‌కు 2,700 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



జూటూరు రమేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన కౌలు రైతు జూటూరు రమేష్(32) అప్పులబాధ భరించలేక ఆదివారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. జూటూరు రమేష్‌కు ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, కంది, వేరుశనగ పంటలను సాగుచేశాడు. రూ.15 లక్షల మేర అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టాడు. పంటలు చేతికి రాక, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపం చెందిన రమేష్ శనివారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. ఉదయం కుటుంబ సభ్యులు గది తలుపులు తెరవగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమేష్‌కు భార్య జ్యోతి, బాబు, పాప ఉన్నారు. గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు చోట్ల రైలు కిందపడి ఇద్దరు..

గుత్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఇద్దరు వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుత్తి-పాతకొత్తచెరువు రైల్వే స్టేషన్‌ల మధ్య ఓబులపురం గ్రామ సమీపంలో రైలు కింద పడి రామకృష్ణ (45)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓబులపురం గ్రామానికి చెందిన రామకృష్ణ మతిస్థిమితం సరిగా లేక అనారోగ్యం కారణంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే విధంగా గుత్తి-రామరాజుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సురేష్(28) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ రోగం నయం కాకపోవడంతో మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం, ఆయిల్ ట్యాంకర్ ఢీ

-యువకుడి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గోరంట్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై రెడ్డి చెరువు కట్ట వద్ద ఆయిల్ ట్యాంకర్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మహేంద్ర (21) అనే యువకుడు మృతిచెందగా, శ్రీనివాసులు, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం గోరంట్ల మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన శంకర్ కుమారుడు మహేంద్ర, స్నేహితులు శ్రీనివాసులు, కార్తీక్ ద్విచక్రవాహనంలో గోరంట్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రెడ్డిచెరువు కట్ట వద్ద కదిరి వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొనగా మహేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా తలకు గాయాలైన శ్రీనివాసులు, కార్తీక్‌ను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ తేజశ్విని ప్రాథమిక చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. గోరంట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి సంఘటనా స్థలాన్ని సందర్శించగా, సర్పంచ్ అశ్వర్థరెడ్డి మృతుడి కుటుంబానికి, గాయపడిన వారికి చికిత్సల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

గోరంట్లలో భారీ చోరీ

- 150 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదు అపహరణ

గోరంట్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ భవనం వెనుక వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు చలపతి నివాసం తాళం పగలకొట్టి 150 గ్రాముల బంగారు వస్తువులు, రూ.7.50 లక్షల నగదు శనివారం అపహరించారు. చలపతి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లారు. ఇంటి ప్రధాన ద్వారం డోర్‌లాక్‌ను గుణపంతో బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా పగులకొట్టి అందులోని బంగారు వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. తలుపులు తెరచి ఉండడంతో వీధి ప్రజలు గుర్తించి, వారికి ఫోన్‌ద్వారా ఆదివారం ఉదయం సమాచారం అందించారు. హుటాహుటిన వారు గోరంట్లకు వచ్చి పరిశీలించగా.. చీటీలకు సంబంధించిన రూ.7.50 లక్షల నగదు, చైన్, ఉంగరాలు తదితర బంగారు వస్తువులు దాదాపు 15 తులాలు చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా.. దుండగలు కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు తెలిసింది. సీఐ శేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా ఆరాధనోత్సవాలు


అలంకరణలో బృందావనం

ధర్మవరంరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి 354వ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. 9 నుంచి 12వ తేదీ వరకు అరాధనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ విచారణకర్త పద్మనాభచార్ తెలిపారు. రెండవరోజు ఆదివారం రాఘవేంద్ర స్వామి మూలవిరాట్‌కు వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. పంచామృతాభిషేకాలు, కనకమహాపూజ, పల్లకిసేవ, మహామంగళ హారతి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఆరాధనోత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆధ్యాత్మికతను పెంపొందించేందుకే పోటీలు


గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

ధర్మవరంరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకే చిత్రలేఖనం, భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించినట్లు ఇస్కాన్ భక్తులు తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 16వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. 150మందికిపైగా బ్రిలియంట్, బీఎస్సార్, పీసీ ఎంఆర్, శ్రీనివాస స్కూల్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటారు. శ్రీకృష్ణుడి బాల్యంలో గడిపిన విశేషాలను చిత్రలేఖనంతో పిల్లలు అద్భుతంగా చిత్రీకరించారు. చిన్నారులు శ్రీకృష్ణుని, శ్రీరాముని, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ముందుగా మందిరంలో ఉన్న జగన్నాథుడు, సుభద్ర, బలరామ ప్రతిమలకు విశేషంగా అలంకరించి హరినామసంకీర్తనలు చేశారు. ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాదవదాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మకతను, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించారు. యాత్ర మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు సాగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఇన్‌చార్జి భాస్కర్‌నాయక్, నరేష్, రంగారెడ్డి, క్రిష్టప్ప, ఆర్ఎంపీ హరిక్రిష్ణ, రాజశేఖర్, అశ్వత్థప్ప, నాగప్ప, శశినాయక్, శీనానాయక్, ఆర్ఎస్ఎస్ నాగేశ్వరయ్య, గోపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాలయ అవరణలో సోమవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ మోసెజ్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, నంబులపూలకుంట, తనకల్లు, ఓడీచెరువు, అమడగూరు, నల్లచెరువు మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో వినియోదారుల ఫోరం చైర్మన్ శ్రీనివాస అంజనేయమూర్తి ఇతర సభ్యుల హాజరవుతారని అన్నారు.

సహకార సొసైటీ అధ్యక్షుడిగా హరిప్రసాద్



కొత్తచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు సహకార సొసైటీ అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు హరిప్రసాద్ ఎంపికయ్యారు. ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆయనను ప్రతిపాదించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో సేవలందించారని వారన్నారు. ఆయన సేవలను గుర్తించి కొత్తచెరువు సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన ఎంపికపట్ల రైతులు, ప్రజలు, పార్టీనాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

తనకల్లు, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డుమరవపల్లి గ్రామ సమీపంలో ఉన్న మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుడికి ఉన్న తాళాలు తీసివేసి, హుండీని పగలకొట్టి, రూ.10వేల నగదును దోచుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల పలు గ్రామదేవతల గుళ్లలో చోరీలు అధికమయ్యాయి. స్థానికంగా తాగుడుకు బానిసైన వారు చేస్తున్నారా, లేక మరెవరైనా చేస్తున్నారా అన్నది పోలీసుల విచారణలో తెలాల్సి ఉంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి

ధర్మవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద రఘునాథరెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై సొంత చిన్నాన్న పుల్లారెడ్డి దాడిచేసిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు గుట్టకిందపల్లికి చెందిన రఘునాథరెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. రఘునాథరెడ్డి పశువుల పాక నుంచి చిన్నాన్న ఇంటి ముందు వర్షపు నీరు వెళ్లాయి. దీంతో పుల్లారెడ్డి రఘునాథరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన తల్లిపద్మావతితో మా ఇంటిముందు నీరు వెళుతున్నాయని వాగ్వాదానికి దిగాడు. గమనించిన రఘునాథరెడ్డి తల్లికి మనకు గొడవ ఎందుకంటూ నచ్చచెప్పి ఇంట్లోకి పిలుచుకెళ్లాడు. దీంతో పుల్లారెడ్డి మధ్యలో నీదేందిరా అంటూ అక్కడే ఉన్న పారతో రఘునాథరెడ్డిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం టూటౌన్ పోలీ‌స్‌స్టేషన్‌లో రఘునాథరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

గుంజేపల్లి ఫీడర్‌కు గ్రహణం

- తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులు
- పట్టించుకోని అధికారులు


గుంజేపల్లి విద్యుత్ ఫీడర్

ముదిగుబ్బ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గుంజేపల్లి ఫీడర్‌కు గ్రహణం పట్టింది. చిన్న చినుకు పడ్డా, గాలి వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. బ్రేకర్‌లు ట్రిప్ కావడంతో విద్యుత్ సమస్య అధికమవుతోంది. గుంజేపల్లి ఫీడర్ కింద గుంజేపల్లి, పొడరాళ్లపల్లి, రామస్వామి తండా, పూజారి తండా, మంగళమడక, ముదిగుబ్బ పాతవూరు, గుడ్డంపల్లి తండాలలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, సంబంధిత గ్రామాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 నిమిషాలకొకసారి బ్రేకర్లు ట్రిప్ అవుతున్నాయని, ఎక్కడైనా జంపర్ కట్ అయినా, ఏదైనా విద్యుత్ అంతరాయం ఏర్పడినా సబ్‌స్టేషన్ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఒకవేళ ఫోన్ పనిచేసినా ఫోన్ తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లైన్‌మెన్‌లు ఎంతమంది ఉన్నా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 10 నిమిషాలకొకసారి పవర్ కట్ అయ్యి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ అప్ అండ్ డౌన్ కావడంతో ఎలక్ట్రికల్ పరికరాలు పాడవుతున్నాయని అంటున్నారు. వినియోగదారులు కదిరిలోని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా తూతూ మంత్రంగానే మరమ్మతు చేయించి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. ఎన్నో మార్లు జాతీయ రహదారిపై, విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నాలు చేసినా అప్పటికి అరకొర మరమ్మతు చేస్తున్నారని వాపోతున్నారు. అనంతరం షరా మామూలే అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదురోజుల నుంచి వర్షాలు అధికంగా కురవడంతో రాత్రి సమయాలలో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ అంతరాయం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, గుంజేపల్లి ఫీడర్ పరిధిలోని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కనెక్షన్లు ఎక్కువగా ఉండటంతోనే సమస్య

-శివతేజ, ఏఈఈ, ముదిగుబ్బ

గుంజేపల్లి ఫీడర్ కింద వ్యవసాయ కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఆర్డీఎస్ఎస్ లైన్ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి అయితే విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



వర్షాకాలం కావడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఐదురోజులుగా రాత్రి వేళల్లో విద్యుత్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కదిరి విద్యుత్ అధికారులు దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లినా స్పందించడం లేదు. విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

- సోమల ప్రకాష్ నాయుడు, ముదిగుబ్బ

ఆందోళనలు చేసినా స్పందించడం లేదు



విద్యుత్ సమస్యపై ఎన్నోసార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా సంబంధిత పైస్థాయి అధికారులు స్పందించడంలేదు. మండలంలో విద్యుత్ సమస్యలు అధికమయ్యాయి. గుంజేపల్లి ఫీడర్‌లో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి బ్రేకర్లు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి.

- చల్లా శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం: యూటీఎఫ్


కేక్ కట్‌చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయమని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి అన్నారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జయచంద్రారెడ్డి ఆదివారం సంఘం కార్యాలయంలో నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ 51 సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగపరిరక్షణే ధ్యేయంగా సంఘం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాల చర్యలు విద్యారంగాన్ని పరిరక్షించే దిశగా ఉండాలన్నారు. విద్యారంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యావిధానాలు మార్చకూడదన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, హెచ్ రామాంజనేయులు, సకల చంద్రశేఖర్, ఆంజనేయులు, సురేశ్, అమర్నాథ్‌రెడ్డి, కృష్ణతేజ, నాగేంద్ర పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పాలకమండలి సభ్యుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ఈఓ కార్యాలయానికి వచ్చి సమర్పించాలని కోరారు. 27వతేదీ సాయంత్రం 6గంటల లోపు ఇవ్వాలన్నారు. వివరాలకు ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖలాధికారులతో మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా పడుతున్న ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విపత్తు సమాచారం కోసం 08555289039 నంబర్‌ను సంప్రదించవచ్చున్నారు.

అటకెక్కిన జలజీవన్

● డ్రిప్ వైర్లతో నీటి సరఫరా


నాయనవారిపల్లిలో పంచాయతీ పైపులకు డ్రిప్‌వైర్లు అమర్చిన దృశ్యం

గాండ్లపెంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికి ఉచిత కొళాయి కనెక్షన్ ఇచ్చి, నీటిని సరఫరా చేయాలన్నదే పథకం ముఖ్య ఉద్దేశం. అలాంటి పథకం అటకెక్కిందనడానికి డ్రిప్‌వైర్లతో నీటి సరఫరానే నిదర్శనం. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతిఇంటికి కొళాయి వేసిన నీటిని అందిస్తున్నారు. అయితే నాయనవారిపల్లిలో ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి కొళాలు ఏర్పాటు చేశారు. ఎస్సీకాలనీకి కొళాయిలు వేయలేదు. కాలనీ వాసులు పంచాయతీ పైపులైన్‌కు డ్రిప్ పైపులు అమర్చి నీటిని వాడుకుంటున్నారు. ఇది కాస్త గ్రామానికి వెళ్లే దారిలోనే డ్రిప్‌వైర్లు ఉండడంతో, వాహనాలు తిరిగే సమయంలో వైర్లు తెగిపోయి నీరు వృథా అవుతోంది. జలజీవన్ పథకంలో ఎస్సీ కాలనీలో కూడా కొళాయిలు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం

ధర్మవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో పూలచెట్లు ఆనంద్ భార్య ముత్యాలమ్మ(19) ఆస్పత్రి ప్రసవించి మృతిచెందింది. విషయం తెలుసుకున్న కృష్ణ, మహేశ్‌ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10వేలు ఆర్థికసాయం భర్తకు అందించారు.

ఏపీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

బత్తలపల్లి జూన్28.(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినట్లు రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశానన్నారు. ఆదివారం ఒంగోలులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ కాలువలు శుభ్రం


ఎక్స్‌కవేటర్‌తో కాలువను శుభ్రం చేయిస్తున్న కమిషనర్, టీడీపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇందిరమ్మ, కేతిరెడ్డి, వైఎస్ఆర్ కాలనీల్లో వర్షపు నీరంతా ఇళ్లలోకి చేరాయి. ప్రజలు నానా అగచాట్లుపడ్డారు. ఇందిరమ్మ కాలనీలో మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతోపాటు రోడ్లన్నీ బురద గుంటలుగా మారి నడవడానికి కూడా వీలులేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పర్యవేక్షించారు. ఆదివారం ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి కాలనీల్లో పర్యటించారు. ఎన్ని మగ్గాల గుంతల్లోకి నీరు చేరాయి, ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డారో తదితర వాటిని కాలనీ వాసులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు బొట్టు కిష్ట, సీబీఎన్ రామకృష్ణ కాలనీలో పూడుకపోయిన డ్రైనేజీలను పారిశుధ్య కార్మికులచేత శుభ్రం చేయించారు. కాలనీల్లోని వీధుల్లో రోడ్ల పక్కన వర్షపు నీరు వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తొలగించారు. ప్రజలకు ఇబ్బందులులేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

ధర్మవరంలో తాగునీటి కష్టాలు..!

- పదిరోజులకోసారి సరఫరా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయంతోనే సమస్య
- మున్సిపల్ అధికారులు


25వ వార్డులో చేతిపంపు వద్ద నీటికోసం క్యూకట్టిన మహిళలు

ధర్మవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటిసమస్యతో ప్రజలు కష్టాలు పడుతున్నారు. పట్టణంలో 40 వార్డులుండగా 1.50లక్షల జనాభా ఉంది. అయితే మున్సిపాలిటీలో తాగునీరు పదిరోజుకొకసారి వస్తోందని, తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా లక్ష్మీచెన్నకేశవపురం, మారుతినగర్, రాజేంద్రనగర్, శివానగర్, శాంతినగర్, చంద్రబాబునగర్, లోనికోట తదితర ప్రాంతాల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. 2009 సంవత్సరానికి ముందు పట్టణంలో నీటి కోసం ప్రజలు ఎలా ఇబ్బందులుపడేవారో అదే పరిస్థితి ప్రస్తుతం నెలకొందని ప్రజలు అంటున్నారు. వార్డుల్లో రోజులకొద్ది తాగునీటి సరఫరా కాకపోవడంతో ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి కనీసం ట్యాంకర్లను పంపించాలని చెప్పినా వారు పట్టించుకోలేదని మండిపడుతున్నారు. చివరికి వార్డుల్లో ఉన్న చేతిపంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో మూడు రోజులు తాగునీరు రాకపోతే ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేసేవారని స్థానికులు అంటున్నారు. పార్నపల్లి డ్యాం వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్ ద్వారా నీటిని పంపింగ్ చేసి సమస్య తలెత్తకుండా చేసేవారన్నారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యతో తాగునీరు సరఫరాలో జాప్యం జరుగుతోందని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారన్నారు. విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు జనరేటర్ ద్వారా నీటిని ఎందుకు పంపింగ్ చేయడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్నపల్లి, తంబాపురం, ధర్మవరం పంప్‌హౌస్‌ల వద్ద జనరేటర్‌కు డీజిల్ ఖర్చు అయితే రాసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన రోజు మార్చిరోజైనా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యతోనే..

- వీరేశ్‌కుమార్, డీఈ, ధర్మవరం

విద్యుత్ సమస్య వల్లనే మున్సిపాలిటీలో తాగునీటిసరఫరాలో జాప్యంజరుగుతుంది. నాలుగురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ సమస్య తలెత్తింది. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.


అడపాలవీధిలో జలమయమైన రోడ్డు

కదిరిలో భారీ వర్షం

● ఇళ్లలోకి చేరిన నీరు ● మున్సిపల్ అధికారుల పరిశీలన

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అడపాలవీధిలోని కుబా మసీదు వద్ద వీధులన్నీ వర్షపు నీటితో నిండాయి. పలువురి ఇళ్లల్లోకి నీరు చేరాయి. దీంతో ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వేళ కావడంతో మరింత ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని 5వ టీడీపీ నాయకుడు ఇమ్రాన్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు తెలియజేడంతో ఆయన వెంటనే స్పందించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. వెంటనే నీటిని పంపడానికి సిబ్బంది చర్యలు చేపట్టారు.

రైతుల సంక్షేమమే కూటమి లక్ష్యం

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


సొసైటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మాజీ మంత్రి పల్లె

బుక్కపట్నం, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రిపల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూనిపల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు జుటూరు ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీరాములు ప్రమాణ స్వీకారానికి పల్లె హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమంకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీ పథకం ద్వారా 46లక్షల కుటుంబలకు రూ.పదివేల కోట్లు వారి ఖాతాలో జమ చేశారన్నారు. మంచి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, క్రిష్టాపురం, వెంగలమ్మ చెరువు సొసైటీ అధ్యక్షుడు అప్పస్వామినాయుడు, శ్రీరామిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, లావణ్యగౌడ్, వెంకటరాముడు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న భైరవప్రసాద్

కదిరిఅర్బన్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరప్రసాద్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలన్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో పార్టీ బలోపేతం కోసం శ్రమించి, చురుకైన కార్యకర్తలను వార్డు ఇన్‌చార్జిలుగా నియమిస్తామన్నారు. ప్రతివార్డుకు కమిటీ వేసి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలా కృషిచేయాలన్నారు. చలపతి, లక్ష్మణ్, మహేష్, ఆంజిబాబు, ప్రతాప్, లోకేశ్, ఐనుద్దీన్, రాజేంద్రప్రసాద్, హరీష్, గంగరాజు, చిన్నపరెడ్డి, మనోహర్, కాకర్ల రామచంద్ర, తుమ్మల రవి, సోము, సాయిప్రియ, జయశ్రీ పాల్గొన్నారు.

భూమనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న రాజశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దళిత యువకుడు పవన్‌పై దాడిచేసిన భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు దళితులనే టార్గెట్ చేసుఉని దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దళితులను బలిపశువులుగా వాడుకుని, వారిని వదిలేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ఎస్సీల మీదే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించిన మూర్ఖులన్నారు. అనేకమంది ఎస్సీల మీద అత్యాచారాలు జరిగాయని, హత్య చేసి ఇంటికే పంపిణీ ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఎస్సీల మీద దాడులు, దౌర్జన్యాలు చేస్తే టీడీపీ చూస్తూ సహించదన్నారు. వెంటనే పవన్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీసెల్ రామాంజనేయులు, మధు, మారుతి, రామచంద్ర, రెడ్డెప్ప, చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాం పాల్గొన్నారు.

ఏడు నెలలుగా జీతాలు లేవు

● పారిశుధ్య కార్మికుల బతుకు దయనీయం



చెత్తను సేకరిస్తున్న పంచాయతీ కార్మికుడు

నంబులపూలకుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియన్‌చెరువులో పనిచేస్తున్న తమకు 7 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఎలా బతకాలని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పంచాయతీ కార్మికులు అల్లాబక్ష, కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి రోజూ వీధులు శుభ్రం చేస్తున్నామన్నారు. ఏదైనా శుభ, అశుభకార్యాలయలు జరిగితే చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తున్నామని, అలాంటి తమకు 7నెలలుగా ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదన్నారు. ఈ జీతంతోనే జీవనం సాగించే తాము ఎలా బతికేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని కోరారు. దీనిపై కార్యదర్శి రెడ్డిభాస్కర్‌ను వివరణ కోగా పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వని మాట వాస్తవమే. పంచాయతీ జనరల్ ఫండ్స్ వచ్చిన వెంటనే కొంత జీతం ఇస్తామన్నారు.

కరాటేలో పురం విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని గౌరీబిదునూరులో ఆదివారం జరిగిన ఏడవ జాతీయస్థాయి కరాటే పోటీల్లో పురం విద్యార్థులు రాణించినట్లు కరాటే మాస్టర్ రఫీక్‌అహ్మద్ తెలిపారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తొమ్మిది మంది పోటీల్లో పాల్గొన్నారు. ఒక బంగారం, మూడు సిల్వర్, ఐదు బ్రాంజ్ మెడళ్లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు రియాజ్ బాషా, జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సాదిక్‌బాషాలు ఉన్నారు.



సర్టిఫికెట్లతో గోరంట్ల విద్యార్థులు

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని గౌరీబిందునూరులో 2025 ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా గోరంట్ల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ఆర్గనైజర్ త్రివిక్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోరంట్లకు చెందిన గోన్‌షీరో కరాటే అకాడమీ విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం జరిగిందన్నారు. కట్టా విభాగంలో గోల్డుమెడల్‌ను మాధవి, పూర్వాజ్, యుధిష్టర్, శాంశాక్, కుమితే విభాగంలో తన్వీష్, కటా విభాగలో కుగన్, తమోజ్ఞా, సాయికార్తీక్, సూర్యతేజ, తన్వీష్‌కు సిల్వర్‌మెడల్ దక్కాయన్నారు. కటా విభాగంలో బ్రాంజ్ మెడల్‌ను తేజేష్, జాహ్నవి, హరిక్రిష్ణ, హర్షవర్ధన్, పూర్వజ్, సాయికార్తీక్, సూర్య సాధించడం జరిగిందన్నారు.

సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుల ఎంపిక



వీరాంజనేయులు



శ్రీనివాసరెడ్డి



రామచంద్ర

రొద్దం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రొద్దం సింగిల్‌విండో అధ్యక్షుడిగా నీరుగంటి వీరాంజనేయులు, కలిపి అధ్యక్షుడిగా కురుబ రాంచంద్ర ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడ నుంచి సొసైటీ అధ్యక్షులుగా ఎంపికైనట్లు ఉత్తర్వులు అందాయి. తమను ఎంపిక చేసినందుకు మంత్రి సవితకు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): చాలకూరు సింగిల్‌విండో అధ్యక్షునిగా కొలిమిపల్లి శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. జూలకుంట చిన్న అంజినప్ప, సుద్దకుంటపల్లి సంజీవప్ప డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. తనపై నమ్మకం ఉంచి సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఎన్నుకున్న నాయకులకు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిపారవశ్యం



భక్తి పాటలు ఆలపిస్తున్న జపానందస్వామి

పావగడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ వివేకానంద పరమహంస భావ ప్రచార సమితి ప్రవచనాలతో అనంతపురంలోని గంగానగరం భక్తి పరవశం అయింది. మూడు నెలల క్రితం ఉపన్యాసం అందించాలన్న భక్తుల కోరిక మేరకు ఆదివారం ఆ నగరానికి వెళ్లినట్లు రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి తెలిపారు. శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విశేష సత్సంగం, ప్రవచనం జరిగాయి.

మురుగు నీటిలోనే బడి ప్రయాణం



మురుగు నీటిలోనే స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

పావగడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వైఎన్‌హొసకోట మండలం సిద్దాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చిక్కజాలోడు గ్రామంలో మురికి నీటిలోనే విద్యార్థులు బడిప్రయాణం చేయాల్సి వస్తోంది. నాలుగైదు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్థులు అంటున్నారు. మురుగు కాలువ పక్కనే తాగునీటి పైప్‌లైన్ కూడా వెళుతుండటంతోఓ తాగునీరు కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనం చోరీ కేసులో అరెస్ట్

పెనుకొండ రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకేసులో మునిమడుగు గ్రామానికి చెందిన ఓబన్నగారి వినోద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మునిమడుగు గ్రామానికి చెందిన ఓబన్నగారి వినోద్ కొన్నాళ్లుగా ద్విచక్రవాహనాలు చోరీలకు పాల్పడుతున్నాడు. మహారాష్ట్ర, బెంగళూరు, చెన్నై తదితర ప్రదేశాల నుంచి ద్విచక్రవాహనాలు చోరీ చేసి అదేగ్రామంలో విక్రయించేవాడు. మూడు రోజుల క్రితం గుట్టూరులో మహారాష్ట్రకు చెందిన ద్విచక్రవాహనం మునిమడుగు గ్రామానికి చెందిన వ్యక్తి తిరుగుతుండగా కియా పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా మునిమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌లో పనినిమిత్తం రొద్దంకు వెళ్లాడు. అక్కడ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వినోద్ అనే వ్యక్తి నుంచి ద్విచక్రవాహనాన్ని కొన్నట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో సీఐ రాఘవన్, కియాఎస్ఐ రాజేష్, సిబ్బందితో కలిసి మునిమడుగు గ్రామానికి చేరుకుని ద్విచక్రవాహనాలను దొంగలించిన వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి 27 ద్విచక్రవాహనాలు స్వాధీనంచేసుకున్నారు. మరో 23 ద్విచక్రవాహనాల కోసం గాలింపు చేపడుతున్నట్లు సమాచారం.

రింగ్ రోడ్డు పనులు ప్రారంభమయ్యేనా..?

టీడీపీ హయాంలో ప్రారంభం

వైసీపీ హయాంలో అటకెక్కిన వైనం

కూటమి ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా..?



పట్టణంలో నడిరోడ్డులో నిలిచిన లారీ

మడకశిర రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ప్రాంతంగా ఉంది. పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దాలని టీడీపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందు కోసం 2018లో టీడీపీ ప్రభుత్వం ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టింది, పనులు కూడా ప్రారంభమయ్యాయి. పట్టణ సమీపంలోనే జాతీయ రహదారులను అనుసంధానం చేయడంతో భారీ వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఆ వాహనాలు పట్టణంలో నుంచి వెళ్లకుండా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఔటర్‌రింగ్ రోడ్డు పనులు చేపట్టారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జరుగుతున్న పనులు కొనసాగుతాయని అనుకున్న ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రింగురోడ్డు పనుల ఊసేలేదని అంటున్నారు. పట్టణ సమీపంలోని మడకశిర, బుళ్లసముద్రం, హరేసముద్రం, మల్లినాయకునిపల్లి, బేగార్లపల్లి మెళవాయి పంచాయతీ గ్రామాల పరిధిలోని భూములను సేకరించారు. బేగార్లపల్లి, రాళ్లపల్లి అటవీ భూములు రింగ్‌రోడ్డుకు తీసుకోవడం జరిగింది. దీంతో రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేశారు. అప్పటి జాయింట్ కలెక్టర్ వచ్చి సేకరించిన భూములను పరిశీలించారు. చీపులేటి సమీపంలో భూములను అందుకు సంబంధించిన స్కెచ్‌ను పరిశీలించారు. 2018లో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. 2019లో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇక రింగురోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. భారీ వాహనాల రాకపోకలు పట్టణంలోనే సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఔటర్‌రింగు రోడ్డు పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చౌటిపల్లి సమీపంలో నిలిచిన రింగ్ రోడ్డు పనులు

నిర్మాణం పూర్తి చేయాలి: వీరాంజనప్ప, మడకశిర



ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణంతోనే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. అంతే కాకుండా పట్టణంలో ప్రమాదాలు తగ్గుతాయి. పట్టణ సమీపంలో ఉన్న కొడికొండ నుంచి శిరకు ఉన్న జాతీయ రహదారి నుంచి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా వజ్రపాళ్యం సమీపం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న మడకశిర-పెనుకొండ ప్రధాన రహదారిలోకి కలపాలి. అప్పుడు భారీ వాహనాల రాకపోకలు పట్టణంలోకి తగ్గుతాయి.

పూర్వ విద్యార్థుల కలయిక

రొద్దం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పెద్దమంతూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు 20 ఏళ్ల తరువాత ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. అప్పటి రోజులను గుర్తు చేసుకుని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం రూ.4లక్షలతో నిర్మించిన డయాస్‌ను ప్రారంభించారు. భవిష్యత్తులో సైన్స్‌ల్యాబ్‌ను తమ వంతు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముజ్జఫర్ హుస్సేన్, రామాంజినేయులు, మాధవీలత, సునందమ్మ, ప్రభావతి, మల్లికార్జున, నరహరి, రమణ, వెంకటేశులు, కలీం, పూర్వ విద్యార్థులు సురేష్, మంజు, మహేష్, సంధ్య, సుధా పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

పెనుకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణే యూటీఎఫ్ ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మౌర్య రెసిడెన్సి వద్ద యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఎగురవేసి నాయకులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యూటీఎఫ్ ధ్యేయమని దానికోసం అహర్నిశలు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ శివయ్య, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, మహేశ్‌కుమార్, మహిళా కమిటీ కన్వీనర్ హసీనాబేగం ఎంకె నబి, రమేష్, రవీంద్రనాథ్, గంగాధర్, మారుతి, రామాంజినేయులు, నరసింహులు పాల్గొన్నారు.

●మడకశిర టౌన్ : పట్టణంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల సంక్షేమానికి 51 సంవత్సరాలుగా కృషి చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాలింగప్ప, కార్యదర్శి వై.జోగప్ప, మండల గౌరవ అధ్యక్షులు నరసింహప్ప, నాయకులు



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నంజప్ప, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

● చిలమత్తూరు: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో యూటీఎఫ్ ముందుంటుందని మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు హక్కులు బాధ్యతలను రెండు కళ్లుగా భావించి ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనరసింహ, లక్ష్మీపతి, సుబ్రహ్మణ్యం, నంజప్ప, సురేష్ ఉన్నారు.

మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



గుండె పరీక్షలు చేస్తున్న వైద్యుడు

గోరంట్ల, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 980 మందికి చికిత్సలు చేశారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్ సహకారంతో శిబిరం నిర్వహించారు. అనంతపురం గుండె వైద్య నిపుణులు నాగరాజు, హిందూపురం నుంచి ఆర్థోపెడిస్ట్ హరికృష్ణ, ఈఎన్‌టీ వైద్యులు మిథిలేష్‌రెడ్డి, గౌనకాలజిస్టు అనుషారెడ్డి, కంటి వైద్యులు బొగ్గు సురేష్ చికిత్స అందజేశారు. కార్యక్రమానికి ఎంపీడీఓ నరేంద్రకుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, లక్ష్మీనారాయణ, సంతోష్, సోముశేఖర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ స్థానానికి నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ స్థానానికి తుమల్ అధ్యక్షుడు పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 24న జరిగే ఎన్నికలకు సంబంధించి 16వ తేదీ వరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే అవకాశం కల్పించారు. 17న పరిశీలన, 18న ఉపసంహరణ ఉంటుంది. 14 మంది డైరెక్టర్లకుగాను ఈనెల 24న ఎన్నికలు జరుగనున్నాయి. అదేరోజు సాయంత్రం ఫలితాలు వెలువడనున్నాయి.

గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాము



హిందూపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు ఆదివారం విజయవాడలో సమావేశమయ్యారు. హిందూపురానికి చెందిన నిమ్మకాయల రామును గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు ప్రకటనలో తెలిపారు. ఈయన్ను స్థానిక గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు.

రేపటి నుంచి ఆనందోత్సవం

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆర్ట్‌ఆఫ్ లివ్వింగ్ ఆధ్వర్యంలో రేపటి నుంచి ఐదు రోజులపాటు ఆనందోత్సవం నిర్వహిస్తున్నట్లు రవిశంకర్ గురూజీ శిష్యబృందం తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 17వరకు ఉదయం 6గంటల నుంచి 8-30గంటలు, సాయంత్రం 6నుంచి రాత్రి 8-30వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌డిజిఎస్‌కళాశాలలోని సెమినార్‌హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆనందం యొక్క బహుళ వ్యక్తీకరణలో భాగంగా సుదర్శన క్రియ యోగాప్రాణాయామం, ధ్యానం, సామూహిక ప్రక్రియలు ఉంటాయన్నారు. దీనివల్ల మానసిక ఒత్తిడి నిర్మూలించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాల్గొనేవారు సోమవారం సాయంత్రంలోపు 9347966234కు సంప్రదించాలన్నారు.

నేడు పురంలో తిరంగా ర్యాలీ

సోమవారం హిందూపురంలో జాతీయ జెండాలతో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి చిన్నమార్కెట్, మెయిన్ బజార్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్‌వరకు ర్యాలీ ఉంటుందన్నారు. పాల్గొనేవారు ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలతో ప్రదర్శనగా రావాల్సి ఉంటుందన్నారు.

బాబును గద్దె దించండి: వైసీపీ

సోమందేపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెడుతున్న చంద్రబాబు నాయుడును ప్రజలు గద్దెదించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉశశ్రీ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి, గుడిపల్లి, కావేటి నాగేపల్లి గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్ని మతాలను సమానంగా చూడాలి'

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేవిధంగా అన్నిమతాలను సమానంగా చూడాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం హిందూపురంలో క్రైస్తవులు ఆగస్టు 10న బ్లాక్‌డేగా పరిగణిస్తూ నిరసన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రెసిడెన్షియల్ ఆర్డర్ మూడో పేరాను వెంటనే రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ రాజ్, సల్మాన్‌రాజ్, అరుణ్‌కుమార్, దేవరాజ్, ఆంజనేయులు, జార్జిబాబు పాల్గొన్నారు.

పురంలో రేపు విద్యుత్ అదాలత్

హిందూపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం హిందూపురంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం మడకశిర నియోజకవర్గాలతోపాటు పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాల వినియోగదారులు సమస్యలుంటే తెలుపుకోవచ్చన్నారు. పట్టణంలోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వద్ద ఉదయం 11నుంచి 1 గంట వరకు ఉంటుందన్నారు. అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, మధుకుమార్ పాల్గొంటారన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం



పెనుకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రాలయం రామవేంద్రస్వామి మఠంలో ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పూర్వారాధన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం భక్తులు నగర సంకీర్తన చేశారు. మహామంగళహారతి, తీర్థప్రసాదం అనంతరం అన్నసంతర్పణ జరిగింది. సోమవారం మధ్యారాధన నిర్వహించనున్నారు.

ఫైనల్లో హెచ్‌సీఏ ఆర్డీటీ జట్టు



ఫైనల్‌కు చేరిన హెచ్‌సీఏ ఆర్డీటీ జట్టు సభ్యులు

మడకశిర టౌన్, ఆగస్టు10(ఆధ్రజ్యోతి): మడకశిర జూనియార్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఎంఎస్‌ఆర్-జీటీఎస్ టీ20 క్రికెట్ పోటీల్లో హెచ్‌సీఏ ఆర్డీటీ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన పోటీలో ఫ్రెండ్స్ ఎలెవన్ జట్టుతో తలపడి విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హెచ్‌సీఏ ఆర్డీటీ జట్టు 20 ఓవర్లలో 163 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఫ్రెండ్స్ లెవెన్ జట్టు 17.5 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు స్పోర్ట్ సభ్యులు నాగేంద్ర, వేణు, డాక్టర్ రవిశంకర్ పోటీలను పర్యవేక్షించారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు

- రాకపోకలకు అంతరాయం



శెట్టిపల్లికి వెళ్లేదారిలో అండర్‌బ్రిడ్జిలో నిలిచిన నీరు

పెనుకొండ రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొండంపల్లి సమీపంలో శెట్టిపల్లికి వెళ్లే అండర్‌బ్రిడ్జి కింద భారీగా వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెనుకొండ నుంచి పుట్టపర్తికి వెళ్లే కొండంపల్లివద్ద శెట్టిపల్లికి వెళ్లేదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. వచ్చిన వర్షంనీరు బయటకు వెళ్లడానికి దారిలేక నీరంతా బ్రిడ్జికింద చేరుతోంది. నడుంలోతునీరు చేరడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీలులేక శెట్టిపల్లి, గాజులపల్లి, నిడిమామిడి, కొట్లపల్లి తదితర పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి అండర్‌బ్రిడ్జి కింద నీరు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కురుస్తున్న వర్షం.. రైతన్నల హర్షం



మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిర టౌన్, ఆగస్టు10(ఆధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుంది, ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో రైతులు పెట్టిన పంటలు పచ్చదనం సంతరించుకుంటూ ఉండడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు, శనివారం రాత్రి కురిసిన వర్షం మడకశిర మండలంలో 35.6మి.మీలుగా నమోదైంది. రొళ్ల మండలం 15.4మి.మీ, అగళి 11.8 మి.మీ, అమరాపురం 9.8 మి.మీ, గుడిబండ మండలంలో 41.2 మి.మీలుగా నమోదైంది.

పార్టీ కోసం పనిచేయాలి

- టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు

పెనుకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి అనుబంధ కమిటీలో ఎంపికైన సభ్యులు పార్టీ అభివృద్ధి కోసం కృషిచేయాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండ మున్సిపాలిటీలోని అనుబంధ కమిటీ ఎన్నికలను పూర్తిచేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ పెనుకొండ మున్సిపాలిటీలో 17 అనుబంధ కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రోజూ రెండుగంటల సమయం ప్రజాసేవకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీరాములు